క్లుప్తంగా

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక పురపాలక సంఘ సమావేశపు హాల్‌లో మున్సిపల్ సాధారణ సమావేశం ఈనెల 27వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ షేక్ దస్తగిరి తెలిపారు. ఈ సమావేశంలో మొత్తం 29 అంశాలను చర్చించి ఆమోదించనున్నట్లు తెలిపారు. సమావేశానికి మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు, వార్డు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

సెబీకి స్థలం కేటాయించాలి



ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులో సెబ్ స్టేషన్ (స్టేట్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషనరీ) నిర్మించేందుకు స్థలం కావాలని సెబ్ ఎస్ఐ సైమన్ బుధవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ మాట్లాడుతూ స్థలాన్ని పరిశీలించి ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్ల మీసాల చెంచయ్య ఉన్నారు.

నూతన బోరు ఏర్పాటుకు భూమిపూజ



ఈపూరు: మండలంలో ఎర్రబాలెం గ్రామంలో శ్మశాన వాటిక వద్ద నూతన బోరు ఏర్పాటుకు ఈపూరు సర్పంచ్ పల్లమీసాల చెంచయ్య బుధవారం శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి తోడ్పడుతుందని, అన్ని పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో గ్రామపార్టీ ప్రెసిడెంట్ బత్తుల వెంకటరామయ్య, కొలగాని నాగేశ్వరరావు, కె.వీరయ్య, సీహెచ్. కృష్ణ, సీహెచ్. వెంకటేశ్వర్లు, వై.సుబ్బారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలి

నరసరావుపేట ఈస్ట్: ఉపాధ్యాయులు అక్రమ సస్పెన్లకు వ్యతిరేకంగా ఫ్యాప్టో పిలుపు మేరకు బుధవారం సెయింటాన్స్ పాఠశాలలోని పదవ తరగతి మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ, పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ పల్నాడుజిల్లా పర్యటనలో చిన్నచిన్న పొరపాట్లకు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయటం తగదని తెలిపారు. విద్యాసంవత్సరం ముగిసే సమయంలో ఉపాధ్యాయులను సమాజం ముందు దోషులుగా నిలబెడుతూ ఇటువంటి చర్యలు తీసుకోవటం తగదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సస్పెన్షలను ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వి.అశోక్‌కుమార్, షేక్.కరిముల్లా(ఎస్‌టీయూ), ఎం.మోహన్‌రావు, ఎస్.సుందరరావు (యుటీఎఫ్) పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీలకు గాయాలు

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో కూలీలు గాయపడిన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చీరాల నుంచి తుఫాను వాహనంలో ఆర్కెస్ట్రా బృందం చిలకలూరిపేట వైపు వస్తుంది. ఈ క్రమంలో మండలంలోని పసుమర్రు గ్రామం నుంచి తిమ్మరాజుపాలెంకు కూలీలతో వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో అట్లూరి వెంకటరత్నంకు తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వెంకటరత్నంను ప్రభుత్వాసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

సొసైటీ అధ్యక్షుడిపై దాడి కేసులో వ్యక్తి అరెస్టు

చిలకలూరిపేటటౌన్: సొసైటీ అధ్యక్షుడిపై దాడి జరిగిన సంఘటన సంబంధించి బుధవారం మందుల హరికృష్ణ అనే వ్యక్తిని రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకా రం సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మురికిపూడి సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా ఆరుమళ్ల వెంకట శివ ఇటీవల నియమితుడయ్యా డు. అదే గ్రామానికి చెందిన మందుల హరికృష్ణ మధ్యాహ్నం సమయంలో వెంకటశివకు పలుమార్లు ఫోన్ చేయగా ఐదోసారి ఫోన్ ఎత్తాడు. నేను ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎందుకు ఎత్తడం లేదని వెంకట శివపై హరికృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో హరికృష్ణ కోపంగా వెంకటశివ కార్యాలయానికి వెళ్లి గొడవపడి దాడి చేశాడు. దీంతో ఇదే విషయాన్ని వెంకటశివ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు హరికృష్ణను అరెస్టు చేశారు.

రాష్ట్రానికి పట్టిన దరిద్రం చంద్రబాబు

- ఆయన లెక్కల చిట్టా మొత్తం చెప్తాం
- అవినీతి ప్రభుత్వానికి మారుపేరు టీడీపీ
- ఇసుక మాఫియా చేసింది మీ ప్రభుత్వంలో కాదా?
- సామాన్య జనం నమ్మే నిజమైన ప్రభుత్వం మాది: ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- జగనన్న కాలనీ నిర్మాణాల పరిశీలన



టిడ్కో గృహాలలో ఏర్పాటుచేసిన మౌలిక వసతులను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రానికి పట్టిన దరిద్రం చంద్రబాబు నాయుడని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం వినుకొండ రోడ్డులోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి లేదు, కేవలం సంక్షేమమే జరుగుతుందని ప్రచారం చేసే వారికి ఈ జగనన్న లేఅవుటే అభివృద్ధికి ఒక ఉదాహరణ అన్నారు. ఈ లేఅవుట్‌లో 5,187 మందికి ఇళ్లస్థలాలు ఇస్తే సుమారుగా 2 వేల ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. మరో 1500 ఇళ్లను లబ్ధిదారులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆప్షన్-3 ఎంచుకున్న వారికి ఇళ్ల నిర్మాణం ప్రభుత్వమే చేపట్టిందన్నారు. రెండో ఫేజ్‌లో మరో 27 ఎకరాలు తీసుకొని మరో 1500 మందికి ఇళ్లపట్టాలు ఇవ్వబోతున్నామన్నారు. ఇదొక ఊరుగా అభివృద్ధి చెందుతుందన్నారు. పరిస్థితి ఈవిధంగా ఉంటే వీటిపై చంద్రబాబు, అతని పార్టీవారు అవాకులు చెవాకులు పేలుతున్నారన్నారు. అసలు టీడీపీ హయాంలో ఎంతమందికి ఇళ్లపట్టాలు ఇచ్చారని ప్రశ్నించారు. టీడీపీ వారు ఇవ్వకపోతే సీఎం జగన్ అధికారంలోకి రాగానే ఇళ్లపట్టాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణం చేస్తున్నారన్నారు. పేదవారికి కావల్సిన విద్యా, వైద్యం, వివిధ సంక్షేమ పథకాలు చేపట్టి ఆచరణలో చేసి చూపిస్తున్నారన్నారు. పేదవారిని కోటీశ్వరులు చేస్తానని చెప్పే చంద్రబాబు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఏమిచేశారని ప్రశ్నించారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక మైనింగ్ చేసింది పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ కాదా అని ప్రశ్నించారు. ధైర్యం ఉంటే ప్రమాణం చేసి చెప్పగలరా? అతడి నుంచి కూడా ఇసుకను కక్కిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉండగా అమరావతి భూములు, ఇసుక కేవలం దోచుకోవడానికే ఉపయోగించుకున్నారన్నారు. జగనన్న కాలనీలు, జేఎన్‌టీయూ, కోటప్పకొండ రోడ్డు, బైపాస్ నిర్మాణం, టిడ్కో గృహాల వద్ద మౌలిక వసతులు, ఆర్‌బీకేలు నిర్మాణం మేము చేస్తే మీరేమీ చేశారో చెప్పండన్నారు. కొందరు కమెడియన్లు ఇక్కడికి వచ్చి సెల్ఫీలు దిగుతున్నారని టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబును ఉద్దేశించి అన్నారు. మా ప్రభుత్వం సెల్ఫీలు ప్రభుత్వం కాదు, పనిచేసే ప్రభుత్వమన్నారు. సామాన్యుడు జీవనానికి కొలబద్దగా తమ ప్రభుత్వ పాలన ఉందన్నారు. మూడు ఎమ్మెల్సీ స్థానాలు గెలుపొందగానే వాపును చూసి బలం అనుకుంటున్నారన్నారు. అధికారం మళ్లీ వస్తుందనే ఊహల్లో టీడీపీ వారు ఉన్నారని, వారికి అధికారం రావటం కలగానే మిగులుతుందన్నారు. మళ్లీ రాష్ట్రానికి సీఎం జగన్ కావటం ఖాయమన్నారు. ఇదే నిజం జాతీయ మీడియా సర్వే సంస్థలు తెలియ చేశాయన్నారు. కిందిస్థాయి ప్రజలు జగన్‌ను కోరుకుంటున్నారన్నారు. టీడీపీ హయాంలో ఎవరెవరు ఇసుక, మైనింగ్ చేశారో లెక్కలు మొత్తం చెబుతామన్నారు. అన్నీ దోచుకొని మాట్లాడే అర్హత వారికి లేదన్నారు. హౌసింగ్ పీడీ వేణుగోపాల రావు, మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఆర్‌వీ రమణానాయక్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరక్టర్ ఎస్.సుజాతాపాల్, జిల్లా కార్యదర్శి కందుల ఎజ్రా, పలువురు ఇంజినీర్లు, గ్రామ, పట్టణ సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైను మినహా...

నరసరావుపేట: టిడ్కో గృహాల వద్ద తాగునీటిపైపులైను నిర్మాణంలో రైల్వేలైను కిందుగా వేసే పనులు తప్పించి మిగతా పనులు పూర్తయ్యాయని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి వెల్లడించారు. బుధవారం ఆయన గృహాలను టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే ఒకటి నాటికి లబ్ధిదార్లకు అందజేయాలని అనుకుంటే పనులు ఆలస్యం కారణంగా మే 15 నాటికి విద్యుత్ పనులు పూర్తిచేసి ఇచ్చేందుకు నిర్ణయించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల గృహాల వద్ద మౌలిక వసతులు కల్పించేందుకు ఒక్కొక్క ప్లాటుకు సీఎం జగన్ రూ.90 వేలు చొప్పున రూ.2,358 కోట్లు ఖర్చుచేస్తున్నారన్నారు. చంద్రబాబు స్లాబు వేసి వదిలేసి వెళ్లిపోతే ఇప్పుడు మేము మౌలిక వసతులు కల్పించి అందజేయబోతున్నామన్నారు. మెయిన్‌రోడ్డు వరకు సీసీరోడ్డు, మధ్యలో కల్వర్టు నిర్మాణం జరుగుతుందన్నారు. దీనిలోని పార్కును అభివృద్ధి చేస్తున్నారన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంతో పాటు 16 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు జరుగుతుందన్నారు. మే 15 తర్వాత మంచిరోజులు చూసుకొని గృహ ప్రవేశాలు చేయాలని లబ్ధిదార్లకు సూచించారు. మౌలిక వసతులు కల్పించినందుకు సీఎం జగన్‌కు అందరూ కృతజ్ఞతలు తెలియచేయాలన్నారు.

లావాదేవీలు పక్కాగా నమోదు చేయాలి

వైఎస్సార్ క్రాంతిపథం ఏపీవో జీవన్



యడ్లపాడు ఆర్‌బీకేలో లోకాస్ యాప్ నిర్వహణపై శిక్షణ ఇస్తున్న రీసోర్సు పర్సన్

యడ్లపాడు: ఇకపై స్వయం సహాయక సంఘాల నిర్వహించే ఆర్థిక లావాదేవీలను పక్కాగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఏపీఎం జీవన్ తెలిపారు. మండల కేంద్రమైన యడ్లపాడు రైతుభరోసా కేంద్రంలో మూడు రోజులు యాప్ శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. వైఎస్సార్ క్రాంతిపథం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణా కార్యక్రమంలో జీవన్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు నిర్వహించే ఆర్థిక లావాదేవీలను పక్కాగా నమోదు చేయాలని డీఆర్‌డీఏ చర్యలు చేపట్టిందని, దీనికోసం కొత్తగా 'లోకాస్' యాప్‌ను రూపొందించిందన్నారు. ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సిబ్బంది సంఘాల కార్యాకలాపాలపై నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ నందు స్వయం సహాయ సంఘాల సభ్యులు, గ్రామ సంఘం మరియు మండల సమాఖ్య యొక్క పూర్తి డేటా జాతీయ స్థాయిలో క్రోడీకరించబడుతుందని వివరించారు. అలాగే జూన్‌నెల 30వ తేదీ వరకు సోషల్ మొబిలైజేషన్ క్యాంపై నిర్వహించి సంఘంలో చేరకుండా ఉన్నటువంటి పేద నిరుపేదలను, విభిన్న ప్రతిభావంతులను గ్రూపులుగా తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు. సంఘంలోని బకాయిలను వసూలు చేయడం మొదలైన కార్యక్రమాలు చేయనున్నట్లు జీవన్ తెలిపారు. అనంతరం రీసోర్సు పర్సన్లు పెద్దయ్య, రాములమ్మ, కిరణ్‌మయి, సునీత కొత్తయాప్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతిపథకం సీసీ సుధా, హేమ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

డీఎల్‌డీవో వెంకటరెడ్డి



సదస్సులో పాల్గొని ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎల్‌డీవో వెంకటరెడ్డి

శావల్యాపురం: జాతీయ ఉపాధి పథకంలో జాబ్ కార్డులు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని డీఎల్‌డీవో యం.వెంకటరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎల్‌డీవో మాట్లాడుతూ ఉపాధి పథకం నిధులతో సన్న, చిన్నకారు రైతులందరూ పశుగ్రాసం సాగు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రెండు సంవత్సరాలకు గాను పశుగ్రాసం సాగు చేసిన రైతులకు రూ.90 వేలు నగదు వివిధ రూపాల్లో ప్రభుత్వం రాయితీపై మంజూరు చేస్తుందన్నారు. మండలంలోని కూలీల సంఖ్య పెంపుదల చేయాలని, తద్వారా మెటీరియల్ నిధులు వస్తాయన్నారు. అధికారుల సూచనలు మేరకు పనులు చేసిన కూలీకు రోజు వారిగా వేతనం రూ.272లు పెంపుదల చేసినట్లు చెప్పారు. మండలంలోని 2500 మంది కూలీలు ప్రస్తుతం పనిచేస్తున్నారన్నారు. అనంతరం గ్రామాల వారీగా ఉపాధి సిబ్బంది ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య టీఏలు శ్రీనివాసరావు గుప్తా, సుబ్బారావు, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు



కొండా జ్యోతి



పప్పూరి అనూష



నుసుము ధనలక్ష్మీ



కొల్లి రూన్సీ

వినుకొండ(నూజెండ్ల): ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులు ఇంటర్ ఫలితాలల్లో సత్తా చాటారు. వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న సీనియర్ ఇంటర్ బైపీసీలో కళాశాలకు చెందిన కొండా జ్యోతి 962 మార్కులు సాధించి టాపర్ గా నిలచింది. అలాగే పప్పూరి అనూష 948 మార్కులతో ద్వితీయ స్థానం పొందింది. నూజెండ్ల మోడల్ స్కూల్‌లో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నుసుము ధనలక్ష్మీ 966, కొల్లి రూన్సీ933 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. మంచిమార్కులు సాధించిన వారిని ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

ఏడీఏ వెంకటేశ్వరరెడ్డి

శావల్యాపురం: వేసవిలో విద్యుత్ సమస్య అధిగమించటానికి ముందుస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు విద్యుత్ ఏడీఏ భవనం వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక విద్యుత్ ఉప కేంద్రాన్ని ఏడీఏ సందర్శించి విద్యుత్ కోతల నియంత్రణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ శావల్యాపురం మండలంలోని పలు గ్రామాల్లో లోటల్టోజ్ సమస్య కలిగిన ఏరియాలను గుర్తించామని 16 కె.వి. సామర్థ్యం కలిగిన 10 ట్రాన్స్‌ఫార్మర్లు త్వరలో ఏర్పాటు చేసి సమస్యను పరిష్కారిస్తామన్నారు. విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ సిబ్బంది భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అకాల వర్షాలు ఈదురు గాలుల సమయంలో విద్యుత్ నిలుపుదల చేయటం ద్వారా పెను తప్పిదాల తగ్గుతాయన్నారు. ఈ సదస్సులో ఏఈ సంపెంగుల గాంధీ, లైన్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

అంగన్‌వాడీకి కూలర్ బహూకరణ

సత్తెనపల్లి: మండలంలోని భట్లూరు అంగన్‌వాడీ కేంద్రానికి లీడ్ బ్యాంక్ గుంటూరు జిల్లా మేనేజర్ ఈదర రాంబాబు, దివ్యలు బుధవారం కూలర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈదర రామారావు, సచివాలయ సెక్రటరీ కృష్ణప్రసాద్, ఈదర మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మిర్చి కోరుపై అధికారులకు ఫిర్యాదు

యడ్లపాడు: మండల కేంద్రంలోని హైవే పక్కనున్న మిర్చి గ్రేడింగ్ యూనిట్‌పై స్థానికులు గ్రామ పంచాయతీ కార్యదర్శి శిశికళకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె బుధవారం మిర్చి గ్రేడింగ్ యూనిట్‌ను పరిశీలించారు. అధికారులు పరిశీలనకు వచ్చారని తెలిసి స్థానికంగా ఫిర్యాదు చేసిన వారు అక్కడి చేరుకోవడంతో గ్రేడింగ్ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లు, స్థానికుల మధ్య వాగ్వాదం జరిగింది. గ్రేడింగ్ నిర్వాహకుడు అక్కడ లేకపోవడంతో కార్యదర్శి ఫోన్‌చేసినా స్పందించ పోవడంతో ఆగ్రహించారు. సదరు గ్రేడింగ్ నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పనుల్ని నిలిపివేయాలని ఆదేశించినట్లు కార్యదర్శి తెలిపారు.

రెండుపూటలు తాగునీటి సరఫరా బంద్

నరసరావుపేట: ప్రకాష్‌నగర్‌లోని మున్సిపల్ అతిథిగృహ ప్రాంగణంలో గల ఓవర్‌హెడ్ ట్యాంకు వద్దనున్న వాల్వ్ మరమ్మతుల నిమిత్తం రెండుపూటల నీటి సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా గురువారం సాయంత్రం, శుక్రవారం ఉదయం నీటిసరఫరా ఉండదని, సాయంత్రం నుంచి యధావిధిగా జరుగుతుందన్నారు. కావున ఈ ట్యాంకు పరిధిలోని ప్రకాష్‌నగర్, షాలెంనగర్, రామిరెడ్డిపేట, అరండల్‌పేట ప్రాంతాల ప్రజలు తాగునీరు పొదుపుగా వాడుకోవాలని కోరారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

సత్తెనపల్లి: ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో గడియార స్తంభం సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని వాసవీ సేవా సమితి అధ్యక్షుడు వెలుగూరు శరత్‌బాబు, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం మాజీ అధ్యక్షుడు కొత్త లక్ష్మయ్య, ఆవోప పట్టణ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యుల సేవల్ని అభినందించారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ మాట్లాడుతూ కొల్లిపర భాస్కర్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆర్య వైశ్య యువజన సంఘం సభ్యులు దేవరపల్లి కాశీ విశ్వనాథం, తేజ, భవిరిశెట్టి హరి కృష్ణ, చెక్కా రవికుమార్ సహకారంతో ప్రతి రోజు మజ్జిగ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు జవ్వాజి రామ్మోహన్‌రావు, స్వామి ప్రసాదు, చిలకల వాసు, కాకర్ల రమేష్, చారి, దేవరపల్లి రాఘవ పాల్గొన్నారు.

జిల్లా పీహెచ్‌సీ నూతన అసోసియేషన్ ఏర్పాటు

నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఏపీపీహెచ్‌సీడీఏ పేరుతో నూతనంగా అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నట్లు నరసరావుపేట పీహెచ్‌సీ డాక్టర్లు బుధవారం తెలిపారు. ప్రభుత్వ పీహెచ్‌సీ అడ్ హాక్ కమిటీ డాక్టర్లు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. శోభారాణిని కలిసి తమ అసోసియేషన్ గురించి వివరించారు. తమ అసోసియేషన్‌కు సంబంధించి త్వరలో ఎన్నికలు జరిగేందుకు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా తాత్కాలిక జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ కె.నాగపద్మజ మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా ప్రభుత్వ పీహెచ్‌సీ డాక్టర్లకు ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరించేందుకు తోడ్పడుతుందన్నారు. ఇలానే రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో తాత్కాలిక అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. అసోసియేషన్ ప్రభుత్వ సూచనల మేరకు పనిచేస్తుందని, దీనివల్ల డాక్టర్లు అందరికీ మంచి జరుగుతుందని ఆశిస్తున్నట్లు ఆమె తెలియజేశారు. త్వరలోనే ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీని ఏర్పాటు చేసుకుంటామని డాక్టర్ నాగపద్మజ వెల్లడించారు.

ఆగస్టు నుంచి నూతన క్యాంపస్‌లో తరగతులు

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- కాకాని జేఎన్‌టీయూఎన్ కళాశాల సందర్శన



కళాశాలలో నిర్మాణ పనులపై ప్రిన్సిపల్‌తో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: కాకానిలోని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణాన్ని అన్ని వసతులతో ఆగస్టు నెలకు సిద్ధం చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని కాకాని వద్ద నిర్మాణంలో జేఎన్‌టీయూఎన్ కళాశాల ప్రాంగాన్ని బుధవారం ఆయన సందర్శించారు. కళాశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న బాలుర, బాలికల వసతి గృహాలు, రోడ్లు, అకడమిక్, అడ్మినిస్ట్రేట్ బ్లాక్‌ల పనుల ప్రగతిపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న అకడమిక్ బ్లాక్-1 పరిశీలించి క్యాంపస్‌లో అందుతున్న సౌకర్యాలపై విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ కాకాని క్యాంపస్‌లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వసతి గృహాల నిర్మాణం వేగంగా జరుగుతుందన్నారు. ఇప్పటికే కళాశాలలో 1400 మంది విద్యార్థులు కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. కళాశాలలో ఇప్పటికే ఉన్న కోర్సులకు అదనంగా మరికొన్ని కోర్సులకు అనుమతివ్వాలని జేఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్‌ను కోరినట్టు తెలిపారు. అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మైనింగ్, కెమికల్, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ కోర్సులను తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శోభన్‌బాబు, తహసీల్దార్ రమణ నాయక్, జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, సర్పంచ్ అడపా ప్రసాదు, ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని కుటుంబానికి ఆర్థిక సాయం



జోజప్ప కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందిస్తున్న డీఈఓ శామ్యూల్

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి మూల్యాంకన కేంద్రంలో విధులు నిర్వహిస్తు గుండెపోటుతో మృతిచెందిన పెదకోట్ల జోజప్ప కుటుంబ సభ్యులకు రూ.1.80 లక్షలను జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ బుధవారం అందించారు. మూల్యాంకన కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు అందించిన విరాళాలతో ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈసందర్భంగా డీఈఓ శామ్యూల్ మాట్లాడుతూ, జోజప్ప ఆకస్మిక మృతి తనను కలచివేసిందన్నారు. ఇటువంటి సంఘటనలు అత్యంత బాధాకరమని తెలిపారు. జోజప్ప కుటుంబానికి అండగా నిలిచిన ఉపాధ్యాయులను అభినందించారు. జోజప్ప కుటుంబ సభ్యులకు తన సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ వేణుగోపాలరావు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎస్.ఎం.ఏ.హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణిత వినీలాకాశంలో ధృవతార రామానుజన్



రామానుజన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు

నాదెండ్ల: గణిత వినీలాకాశంలో శ్రీనివాస రామానుజన్ ఓ ధృవతారని హెచ్ఎం తాడిశెట్టి సత్యనారాయణ చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం గణిత శాస్త్ర మేధావి శ్రీనివాస రామానుజన్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ, భారతదేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచ నలుమూలల రెపరెపలాడించిన గొప్ప శాస్త్రవేత్త రామానుజన్ అన్నారు. 1887లో జన్మించిన ఆయన ఏప్రియల్ 26, 1920న తన 33 ఏళ్లలోనే మరణించటం బాధకరమన్నారు. 1729 అనే సంఖ్య ప్రాముఖ్యతను వివరించటంతో దీన్ని రామానుజన్ సంఖ్యగా గుర్తింపు వచ్చిందన్నారు. ఆయన జయంతిని జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులు కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ ఈసీ మెంబర్‌గా శ్రీరాములు



పొట్టి శ్రీరాములు

చిలకలూరిపేట: వాసవీ ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా పట్టణానికి చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ పొట్టి శ్రీరాములు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు ట్రస్ట్ చైర్మన్ గంజి రాజమౌళిగుప్తా బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని వాసవీ ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్‌లో 370 మంది విద్యార్థులకు వసతి సౌకర్యం ఉంటుందని, అదే విధంగా కొణిజేటి రోశయ్య గెస్ట్ హౌస్‌లో 70 ఏసీ గదులు ప్రత్యేకంగా ఉన్నాయని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల ఆర్యవైశ్య విద్యార్థులు ఈ వసతి సౌకర్యాలను ఉపయోగించుకొని ఉన్నత విద్య అభ్యసించవచ్చని తెలిపారు. ఈసీ మెంబర్‌గా తనను నియమించినందుకు ట్రస్టు చైర్మన్ రాజమౌళిగుప్తాకు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ శ్రీనివాసరావుకు అవార్డు



చిలకలూరిపేట: పట్టణంలోని ఏరియా వెటర్నరీ వైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేస్తున్న డాక్టర్ తన్నీరు శ్రీనివాసరావు ఔట్ స్టాండింగ్ వెటర్నేరియన్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లివారి కళాక్షేత్రంలో వరల్డ్ వెటర్నరీ డే ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖా మంత్రి సీదిరి అప్పలరాజు చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకోనున్నారు. 1993లో వెటర్నరీ వైద్యుడిగా విధుల్లో చేరిన ఆయన 30 ఏళ్ల సర్వీసులో పలు అవార్డులు, రివార్డులు పొంది ఉన్నారు. జాతీయ, అంతర్జాతీయ సెమినార్స్‌లో పాల్గొన్న ఆయన విధులు నిర్వర్తించిన ప్రతి చోటా ఆసుపత్రి భవనాల అభివృద్ధికి కృషి చేశారు. పెంపుడు జంతువుల సంరక్షణతో పాటు వీధి కుక్కలకు సైతం వ్యాక్సినేషన్ నిర్వహించటం వంటి సేవలకు గాను ఆయనకు పురస్కారం లభించింది.

బదిలీపై వెళ్తున్న జూనియర్ సివిల్ జడ్జికి వీడ్కోలు



జూనియర్ సివిల్ జడ్జి తౌషిద్ హుస్సేన్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

వినుకొండ టౌన్: బదిలీపై సత్తెనపల్లి వెళ్తున్న స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఎ. తౌషిద్ హుస్సేన్‌కు వినుకొండ బార్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా న్యాయవాద సంఘం అధ్యక్ష కార్యదర్శులు చాగంటి వీరాంజనేయ చౌదరి, కె.హనుమంత రావు, కార్యవర్గ సభ్యులు మారెళ్ళ సీతారామాంజనేయులు, పివి రమణారెడ్డి, కాకాని నాగేశ్వరరావులు బార్ అసోసియేషన్ బిల్డింగ్ నందు ఆయన గౌరవార్థం తేనిటి విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా పలువురు న్యాయవాద సంఘం సభ్యులు, సీనియర్ న్యాయవాదులు ఆయనను ఘనంగా సన్మానించి, సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు జాన్ లూకా, ఎంఎస్. ప్రసాద్, గంధం వెంకటేశ్వర్లు, ఎలీషాబాబు, జెట్టి తిరుపతి రావు, గరికపాటి సురేష్, గంధం హరిప్రసాద్, మహమ్మద్ ఖాసిం, అశోక్‌బాబు, శేఖర్‌బాబు, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

30న వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో వేంచేసియున్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పూజారి పులుకూరి శ్రీనివాసచారి బుధవారం తెలిపారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు అన్నదానం కార్యక్రమం కూడ ఏర్పాటు చేశామన్నారు.